నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
శుక్రవారం
22 ఆగస్టు 2025 పేజీలు : 08






## రామిరెడ్డిని అరెస్టు చేయాలి



### టీడీపీ నాయకుల డిమాండ్

**దగదర్తి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గంలో హత్యా రాజకీయాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని దగదర్తి మండలం టీడీపీ ఇంచార్జ్ పమిడి రవికుమార్ చౌదరి అన్నారు. రెండు రోజుల క్రితం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అన్నవరం క్వారీలో

> 2లో..

### కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు

## 23న సర్టిఫికెట్ వెరిఫికేషన్

### జిల్లా ఎస్పీ కృష్ణకాంత్




**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్, జనవరి నెలలో జరిగిన కానిస్టేబుళ్ల ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు హాజరై, సివిల్, ఏపీ ఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, మహిళ అభ్యర్థులు ఈనెల 23వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో

మిగతా 02లో

## వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం దారుణం

02 పేజీలో






# వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం దారుణం

**ఎస్పీకి వినతి పత్రం అందజేసిన రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి**



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరిపాలనను పూర్తిగా గాలికొదిలేసి వైసీపీ నాయకులకు అక్రమ కేసులు పెడుతుందని వైఎస్ఆర్సిపి రీజినల్ కోఆర్డినేటర్ కారూమూరి నాగేశ్వరరావు జిల్లా ఎస్పీ అందుబాటు లేకపోవడంతో డీ ఎస్పీకి గురువారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి నేతలే టార్గెట్ గా కూటమి ప్రభుత్వం వారిపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడుతోందని మండిపడ్డారు. ఇటీవల నెల్లూరు పర్యటనకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి విచ్చేసిన సమయంలో వైఎస్ఆర్సిపి నేతలను ఇబ్బంది పెట్టేలా కూటమి ప్రభుత్వం చేసిన కుట్రలు అందరికి తెలిసినవేనన్నారు. వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నేతలు జగన్మోహన్ రెడ్డి పర్యటనకు రాకుండా, రహదారుల్లో గుంతలు తీయడం, బారికేడ్లు ఏర్పాటు చేయడం వస్తున్న వారిని ఎక్కడికి అక్కడ అడ్డుకొని అరెస్టులు చేయడం చూశా మన్నారు. ఇలాంటి దుష్ట సంస్కృతిని రాష్ట్రంలో ఎన్నడూ చూడలేదన్నారు. అయినప్పటికీ జగన్మో హన్ రెడ్డిని కలిసేందుకు వేలాదిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వస్తే వారిపై అక్రమకేసులు బనాయిస్తుండడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్న తీరు ప్రజలందరికీ అర్థమవుతుం దన్నారు. ఈ విషయంపై గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీని కలిసి మెమొరాండం ఇద్దామని వస్తే ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో డిఎస్పీకి మెమోరాండం అందజేశామని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పర్యటనలో కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్సిపి నేతలపై కక్షపూరితంగా కేసులు నమోదు చేయిస్తుందని ఈ పద్ధతి సరికాదని.ఇలాంటి వాటిని పోలీసు డిపార్ట్మెంట్ వారు కూడా ప్రోత్సహించవద్దని కేసులు పెట్టే పద్ధతి మానుకోవాలని తెలిపామన్నారు. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఆదేశాలతో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలపై పోలీసులు ఇష్టానుసారంగా కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న వైఎస్ఆర్సిపి నేతల పేర్లను మాత్రమే పోలీసులు ఎఫ్ఐఆర్లు నమోదు చేసి అడ్డగోలుగా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఆ ఘటనలు జరిగిన సమయంలో వారు అక్కడున్నారా లేదా అన్న కనీస అవగాహన కూడా లేకుండా వారు ఏ సెక్షన్లు చెబితే ఆ సెక్షన్లు పెట్టి దుర్మార్గంగా కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ నేతల చేతుల్లో పోలీస్ డిపార్ట్మెంట్ కీలుబొమ్మగా మారిందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి పోలీస్ డిపార్ట్మెంట్ కు పూర్తిగా సహకరిస్తూ వస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటన రోజు పోలీసులే వైఎస్ఆర్సిపి నేతలపై లాఠీచార్జ్ చేసి వారిని కిందపడేసి తిరిగి వైస్సార్సీపీ నేతల పైనే అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికే ఈ విషయంలో 25 మందిపై అక్రమ కేసులు నమోదు చేసి ఉన్నారన్నారు. ఇటీవల కావలి మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్ సీపీ నేత రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిపై కూడా హత్యాయత్నం కేసు నమోదు చేశారన్నారు. కావలిలో ఒకచోట ఇల్లీగల్ మైనింగ్ జరుగుతుందన్న విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని ఉద్దేశంతో అక్కడ నిఘా ఉంచి ఫోటోలు తీయడానికి మనుషులను పంపితే రెక్కి నిర్వహించారని అభియోగం మోపడం దుర్మార్గమన్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు ఎంతో విలువైన సేవలు అందించిన రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిపై ఇలాంటి ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్ఆర్ సీపీ నేతలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ ఇలా ప్రతి ఒక్కరి పై అక్రమ కేసులు నమోదు చేయాలనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తుందన్నారు. వైఎస్ఆర్సిపి నేతలను అనవసరంగా టార్గెట్ చేసి కేసులు పెడుతున్న తెలుగుదేశం పార్టీని చూసి ప్రజలు కూడా భయపడుతున్నారన్నారు. ప్రజల మీద కూడా అక్రమ కేసులు బనాయి ఇస్తారేమో నన్న సందేహం ప్రతి ఒక్కరిలో కలుగుతుంద న్నారు. కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులను. జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీసు వారిని కలిసి అన్ని తెలియజేయడం జరిగింద న్నారు. అక్రమ కేసులు విషయంలో మార్పు రాకుంటే రాబోయే రోజుల్లో దీన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో ఆలోచన చేసి పటిష్టమైన కార్యచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీ వయ్య, నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయ కుమార్‌రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు 23న సర్టిఫికెట్ వెరిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)



హాజరు కావాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ గురువారం తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ద్వారా ఏపీఎస్పీ, సివిల్ విభాగాలలో ఎంపికైన అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలను తీసుకు రావాలని తెలియజేశారు. అందులో ముఖ్యంగా అభ్యర్థులు సెలక్షన్ ప్రక్రియలో అప్లికేషన్‌తో జతపరిచిన ధృవీకరణ పత్రాలు ఒరిజినల్ సర్టిఫికెట్స్, అదేవిధంగా గెజిట్ అధికారితో అటెస్టేషను చేయించి పై ఒరిజినల్ సర్టిఫికెట్లు 3 సెట్లు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని, అంతేకాకుండా హాజరైన అభ్యర్థి అటెస్టేషన్ ఫారంలో పూర్తి వివరాలు పొందపరచిన తర్వాత గెజిట్ అధికారులతో ధ్రువీకరణ చేయడం తప్పనిసరి అన్నారు. అభ్యర్థులు ఇటీవల తీయించిన ఆరు పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫోటోలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఎస్పీ తెలిపారు.

## రామిరెడ్డిని అరెస్టు చేయాలి




(మొదటి పేజీ తరువాయి)

మాజీ ఎమ్మెల్యే కొంత మందిని రౌడీలను తీసుకువచ్చి తన అనుచరులతో డ్రోన్ కెమెరా ద్వారా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆచూకీ తెలుసుకొని హత్య చేయించాలనుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. దానికి నిరసనగా గురువారం సాయంత్రం దగదర్తి కెనరా బ్యాంక్ వద్ద నుంచి వేలిపోడు రోడ్డు వరకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర చేసి దహనం చేశారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ హత్యా ప్రయత్నం చేసిన ప్రధాన సూత్రధారైన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారీగా పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల ఉద్యమం ఫలించేనా ?

- అమలుకునోచుకోని నాటి వైసీపీ సర్కారు హామీలు
- నేటి టీడీపీ హామీలపై ఎదురుచూపులు
- ఫోన్‌లను వాపసు చేసిన కార్యకర్తలు




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ నియమాల మేరకు విద్యార్హతలు కలిగి, ఇంటర్వ్యూలల్లో నెగ్గి అంగన్‌వాడీ కార్యకర్తలుగా నామమాత్రపు గౌరవ వేతనంతో నియమితులై దశాబ్దాల తరబడి కొనసాగుతుండగా వారికి కనీస వేతనాలు లభించే పరిస్థితి కానరావడం లేదు. ఎన్నెన్నో ఉద్యమాలు, ఆందోళనలు, 42 రోజుల పాటు సమ్మె తదితర కార్యక్రమాలను నిర్వహించినా వారికి ఫలితం లభించలేదు. ప్రభుత్వం అనేక యాప్‌లు రూపొందించి అమలులోకి తేగా అవి సక్రమంగా పనిచేయక, ఆన్‌లైన్‌లో ఫోటోలు, వివరాలు నమోదు కాక గంటల తరబడి ఇబ్బందిపడుతూ విసిగి వేసారిపోయి ఇటీవల తమవద్ద ఉన్న ఫోన్లను ప్రభుత్వానికి వాపసు చేశారు. తాజాగా గురువారం ధర్నా, మానవహారం కార్యక్రమాలు చేపట్టారు. రూ.500తో ప్రారంభమైన అంగన్‌వాడీ కార్యకర్తలు, రూ.250తో ప్రారంభమైన అంగన్‌వాడీ సహాయకులకు తరచూ ఉద్యమాలు సాగించగా అప్పుడప్పుడూ ప్రభుత్వాలు కొద్దికొద్దిగా వేతనాలు పెంచి నేడు అంగన్‌వాడీ కార్యకర్తలు 11,500 రూపాయలు, సహాయకులు రూ.7 వేల గౌరవ వేతనం పొందుతున్నారు. పూర్తి సమయం కేటాయించి చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను అందిస్తూ గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కనీసవేతనాలు కూడా లభించడం లేదంటూ 2023 డిసెంబర్ 12వ తేదీ నుండి 2024 జనవరి 24వ తేదీ వరకు నిరవధిక సమ్మె చేశారు.. ధర్నాలు చేశారు. వివిధ రకాల నిరసనలు చేశారు. వైసిపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, వివిధ ప్రజా సంఘాల వారు మద్ధతిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉద్యమం కొనసాగింది. అయితే అప్పటి వైసిపి ప్రభుత్వం అనేకరకాలుగా వారిని బెదిరించారు. నోటీసులిచ్చారు. ఉద్యోగాలు తొలగిస్తామంటూ షోకాజ్ నోటీసులిచ్చారు. సచివాలయ సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తామంటూ తాళాలు కూడా పగుల గొట్టించారు. వారందరి ఉద్యోగాలు తొలగించి కొత్తవారిని నియమించుకునేలా నోటిఫికేషన్లు కూడా సిద్ధం చేశారు. దీర్ఘకాలింగా సంఘటితమైన అంగన్‌వాడీలు 43రోజుల పాటు సమ్మెచేసి సంక్రాంతి, క్రిస్మస్ పండుగలను సైతం లెక్కచేయకుండా శిబిరాల్లోనే ఉన్నారు. పలుదపాలు అప్పటి వైసిపి ప్రభుత్వం ఉద్యమనేతలతో చర్చలు జరపడం, విఫలం కావడంతో 42వ రోజుకు సమ్మె చేరిన సందర్భంగా ప్రభుత్వం తమ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా ఉద్యమ నేతలతో చర్చలు జరిపి కొన్ని హామీలిచ్చారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, 26 వేల రూపాయల కనీస వేతనాలివ్వాలని, మినీ అంగన్‌వాడీలను మెయిన్‌లుగా మార్చాలని, పెన్షన్ అమలు చేయాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచాలని, అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, యాప్‌ల బెడద తొలగించి ఒకే యాప్ అమలు చేయాలని తదితర డిమాండ్లతో దీర్ఘకాలిక ఉద్యమం సాగించారు.

**అమలుకాని వైసీపీ హామీలు :**

చర్చల ద్వారా అప్పటి వైసిపి ప్రభుత్వం కొన్ని హామీలివ్వగా జివోలిచ్చామన్నారే తప్ప అమలుకు నోచుకోలేదు. గ్రాట్యుటి ఇస్తామని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కార్యకర్తలకు 50 వేల నుండి 1.2 లక్షలకు పెంచుతామని, సహాయకులకు 40 వేల నుండి 60 వేలకు పెంచుతామని, రిటైర్‌మెంట్ వయసు 60 నుండి 62 సంవత్సరాలకు పెంచుతామని టిఏ, డిఏలు చెల్లిస్తామని హామీలిచ్చి ఆమేరకు జివోలిస్తున్నామని ప్రకటించారు. కనీసవేతనం, వేతనాల పెంపు విషయమై మాత్రం ఎలాంటి హామీ ఇవ్వలేదు. అయితే వారు ఈ ఉద్యమం అనంతరం 5 నెలలు అధికారంలో ఉన్నా.. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేశారని వాపోతున్నారు.

**టీడీపీ హామీలపై ఎదురుచూపులు :**

నాటి సమ్మె సందర్భంగా మద్ధతిచ్చిన తెలుగుదేశం అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ బాబు తదితరులు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని, వారి న్యాయమైన కోర్కెలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీలిచ్చారు. నాలుగు రోజుల క్రితం ఆ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామన్నారు. అయితే ఏమేరకు న్యాయం చేస్తారు, ఏ కోర్కెలను ఆమోదిస్తారో స్పష్టం చేయలేదు. అయినా తెలుగుదేశం పాలకులపై నమ్మకం ఉందని, తమకు తప్పకుండా న్యాయం చేస్తారంటూ అంగన్‌వాడీలు పేర్కొంటూ ప్రభుత్వ నిర్ణయాల కోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. మరి అంగన్‌వాడీలకు ఎలాంటి ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తుందో చూడాల్సి ఉంది.

# దేవాలయ పునర్నిర్మాణానికి బాలలయ కార్యక్రమం పూర్తి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం గుండెమడుగుల గ్రామంలో శిథిలావస్థకు చేరిన శ్రీ కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మానానికి బుధ గురువారాలలో చేపట్టిన బాలాలయ కార్యక్రమం పూర్తయిందని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఈ ఆలయం పురాతనమైనదని ప్రస్తుతం శిథిలావస్థకు చేరగా పునర్నిర్మాణానికి గ్రామస్తులు, కమిటీ చైర్మన్ అంకినపల్లె ఓబుల్ రెడ్డి ఆలయ ధర్మకర్త చీమల వెంకట రత్నారెడ్డి, స్థానికుల సభ్యులు సహకారంతో టీటీడీ సౌజన్యంతో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 75 లక్షల రూపాయలను మంజూరు చేయించి గ్రామస్తుల భాగస్వామ్యం 25లక్షల రూపాయలతో మొత్తం కోటి రూపాయల వ్యయంతో ఆలయ నిర్మాణానికి రెండు రోజులుగా బలాలయ కార్యక్రమాన్ని జరిపించి పూర్తి చేశారు వెంటనే ఆలయ నిర్మాణ పనులు చేపడతామని వారు తెలిపారు. గురువారం ఉదయాన్నే ఆలయంలో రుత్విక్ ల సహకారంతో సంప్రోక్షణ గోమాత పూజ కలశ పూజ, హెూమాధి కార్యక్రమాలు జరిపించారు. ఈ సందర్భంగా ఓబుల్ రెడ్డి కమిటీ సభ్యులు గాలి నరసప నాయుడు చైర్మన్ రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్తుల సహకారంతో 25 లక్షలు పోగుచేసి టీటీడీ అనుబంధమైన శ్రీవాణి ట్రస్ట్‌కు డిపాజిట్ చేశామని అందుకు శ్రీవాణి ట్రస్ట్ వారు 75లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ ఆలయ నిర్మాణానికి కోటి రూపాయలు కూడా సరిపడవని మిగిలిన మొత్తాన్ని దాతలు ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధుల ద్వారా సేకరించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. భగవంతుని ఆశీస్సులతో ఈ ఆలయ నిర్మాణం ఎలాంటి అవాంతరాలు ఎదుర్కోకుండా పూర్తికాగలరని ఆశ భావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ నిధులు మంజూరు చేసేందుకు సహకరించిన దేవాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి టీటీడీ సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులుబూరాల శ్రీనివాసులు యాదవ్ దాట్ల విజయభాస్కర్ రెడ్డి సుంకం వెంకటేశ్వర్లు ఎస్.కె ఖాజావలి నల్లబోతుల హజరతయ్యాతోపాటు కుంకు కొండయ్య నాయుడు అంకినపల్లి గోవింద రెడ్డి ఏలేశం వెంకట్‌రెడ్డి గ్రామస్తులు భక్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కసుమూరులో రైతులకు ఆధునిక వ్యవసాయ శిక్షణ




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ–ఏటీఎంఏ), నెల్లూరు ఆధ్వర్యంలో వెంకటాచలం మండలం కసుమూరు గ్రామంలో రైతులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. వరిలో జీవన ఎరువులు అజోల్లా, అజోస్పిరిల్లం వాడకం ద్వారా యూరియా వినియోగం తగ్గించుకోవచ్చని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీ శివ జ్యోతి రైతులకు వరిలో చీడపీడల నివారణ, సమగ్ర సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఐ. మురళి మాట్లాడుతూ రైతులకు ఆహార ధాన్యాలు, చేపల పెంపకం, రొయ్యల పెంపకం, పశువుల పెంపకం, ఉద్యాన పంటలు, డ్రోన్ల వినియోగం, సమగ్ర ఎరువుల యాజమాన్యం వంటి అంశాలపై జిల్లాలో విస్తృత శిక్షణా కార్యక్రమాలు, ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కసుమూరులో నిర్వహించిన ఈ శిక్షణలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మేలైన వరి వంగడాలు ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638తో పాటు ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, జొన్న సాగు గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి డి.హరి కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాల వివరాలు తెలియజేశారు. పచ్చిరొట్ట విత్తనాలను రాయితీతో అందిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం పొందని రైతులు తమ పొలాలను ఆధార్ కార్డుతో అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. అధికంగా రసాయన ఎరువులు వాడరాదని రైతులకు సూచించారు. ఇఫ్కో ఏరియా మేనేజర్ వీఆర్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.. నానో యూరియా, నానో డీఏపీ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వీటి వాడకం ద్వారా సాధారణ ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు పెంచల స్వామి, గ్రామ పెద్దలు లగుంసాని వెంకయ్య నాయుడు, వెంకట రమణయ్య, మస్తానయ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

# మండపాలకు ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి : సీఐ



**కావలి, మేజర్‌న్యూస్ :** ఈనెల 27వ తేది వినాయక చవితి ఉన్నందున,వినాయక విగ్రహాలను మండపాలయందు ప్రతిష్టించి పండుగ జరుపుకొనే వ్యక్తులు గణేష్ ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఒకటో పట్టణ సీఐ తెలిపారు. ఈ మేరకు సీఐ ఫిరోజ్ మాట్లాడుతూ. విగ్రహాలను పెట్టుకునే వ్యక్తులు పైన తెలిపిన వెబ్ సైట్ ఓపెన్ చేసి పోలీస్ వారి వద్ద నుండి పర్మిషన్ తీసుకొనుటకు సదరు వెబ్ సైట్ ఓపెన్ చేయగానే గణేశ్ ఉత్సవ్ 2025 ఆన్లైన్ పర్మిషన్ పోర్టల్ ఓపెన్ అవుతుందని, అందులో అప్లై హర్ ఉన్నచోట మీ మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేసి జనరేట్ ఓటీపీ పైన క్లిక్ చేసిన తరువాత మీ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుందన్నారు. దానిని అక్కడ ఎంటర్ చేస్తే అప్లికేషన్ ఫారం ఓపెన్ అవుతుంది. తరువాత అక్కడ అడిగిన అన్ని వివరాలు తెలిపిన వాటిని పూరించిన తరువాత సదరు అప్లికేషన్ పోలీస్ స్టేషన్ కు వస్తుంది. అంతట అక్కడ నుండి పోలీస్ వారు చెక్ చేసి అనుమతి చేయడం జరుగుతుందని అన్నారు. తరువాత అదే వెబ్ సైట్ నందు క్యూఆర్ కోడ్ ఓపెన్ అవుతుందని అంతట సదరు కోడ్ డౌన్ లోడ్ చేసి, ప్రింట్ తీసి గణేష్ మండపం నందు తప్పనిసరిగా వుంచవలెనన్నారు. ఈ కోడ్‌ను పోలీసులు ప్రతిరోజు వచ్చి చెక్ చేస్తారని, గణేష్ ఉత్సవాలు జరుపుకునే వారందరూ కచ్చితంగా సదరు గణేష్ మండపాలలో సీసీ కెమెరాలు పెట్టవలెనన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకొని, గణేష్ మండంపం నందు కమిటీ సభ్యులు ఎవరైనా ఒకరు ప్రతిరోజు ఉండాలని, అంతేకాకుండా మైక్ సిస్టంలు పెట్టదలచిన వారు మీసేవా నందు అప్లై చేసుకొని పోలీస్ వారి వద్ద నుండి పర్మిషన్ తీసుకోవలెను. ప్రజలందరూ శాంతియుతంగా వినాయక చవితి జరుపుకోవాలని అలాగే శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. పై నియమ నిబంధనలు పాటించక, చట్ట విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కారుమూరితో చర్చించిన జిల్లా నేతలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు డైకస్ రోడ్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో రీజినల్ కోఆర్డినేటర్ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిలివేటి సంజీవయ్యతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ మండల, గ్రామ కమిటీలను త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని దానికి సంబందించి తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్సిపి నేతలు,కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులను సంఘటితంగా ఏవిధంగా ఎదుర్కోవాలి అందుకు సంబంధించిన కార్యచరణ పై చర్చించారు.

## సిమెంట్ ఇటుక తయారీ కేంద్రం ప్రారంభోత్సవం



**దుత్తలూరు/వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన దుత్తలూరులో గురువారం అత్యాధునికమైన సిమెంట్ ఇటుక తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు బిజెపి మాజీ కిసాన్ మోర్చా మాజీ జిల్లా ఉపాధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ వెంగమాంబ ఆశీస్సులతో కుక్కపల్లి వెంగళరావు దుత్తలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఇటుక తయారీ వ్యాపారంలో నమ్మకం, నాణ్యత, నైతికవిలువలను ఉంటాయని, అదే మూలసూత్రంతో ప్రజాభిమానంతో వ్యాపారం దిగ్విజయంగా కొనసాగాలని మనస్ఫూర్తిగా దేవుని ప్రార్థిస్తున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కాకర్ల మధు సుబ్బారెడ్డి ఏలూరు హనుమంతరావు అంజిరెడ్డి, వాజ్‌పాయ్, పలువురు ప్రజాప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

### హత్యా ప్రయత్నానికి నిరసనగా..

## దిష్టిబొమ్మ దగ్ధం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే హత్య ప్రయత్నం గురువారం స్థానిక వైకుంఠపురంలో ఉన్న ఎన్టీఆర్ రామారావు విగ్రహం దగ్గర అవార్డు ఇన్‌చార్జ్ మంచాల ప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రామ్‌రెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కావలి పట్టణంలో ఇటువంటి సాంస్కృతికి మంచి పద్ధతి కాదని హి తువు పలికారు. ఈ కార్యక్రమంలో తలపనేని ప్రభాకర్, దశరదయ,రంగయ్య భాస్కర్, శోభన్ సుధాకర్, పద్మావతి, వార్డు సభ్యులు మహిళా నాయకులు కేఎస్ఎస్, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

# చక్కెర ఫ్యాక్టరీ బకాయిలు ఇప్పించాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి




**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మహమ్మదాపురంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డిని టీడీపీ రైతు నాయకులు అడపాల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు కలిసి తమకు రావాల్సిన షుగర్ ఫ్యాక్టరీ బకాయిలు ఇప్పించాలని కోరారు. ఏడేళ్లుగా ఫ్యాక్టరీ యాజమాన్యం తమ బకాయిలు ఇవ్వకుండా నిలిపివేసిందని వాపోయారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఫ్యాక్టరీ భూములను వేలం వేసి తమ బకాయిలు ఇప్పించాలని ఈ సందర్భంగా సోమిరెడ్డికి రైతులు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్‌తో చర్చించి చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి సోమిరెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పిఎసిఎస్ డైరెక్టర్ కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ అక్కెమ్ సుధాకర్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, నల్లపాలెం నీటి సంఘం అధ్యక్షులు పార్లపల్లి రమేష్‌రెడ్డి, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, టిడిపి నాయకులు దేగా యశ్వంత్ రెడ్డి, బాలిరెడ్డి హనుమారెడ్డి, గుడి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాకాణి విడుదల ఆనందంతో.. టెంకాయలు కొట్టారు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర మాజీ మంత్రి, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణిగోవర్ధన్ రెడ్డి జిల్లా కేంద్రంలో 85 రోజులు పాటు జైల్లో ఉండి రాష్ట్ర హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బ్రహ్మదేవి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. గురువారం గ్రామం నడిబొడ్డు అభయ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద మొక్కులు తీర్చుకున్నారు. తమ నాయకుడు జైలు నుంచి త్వరగా బయటకు వస్తే 101 టెంకాయలు కొడతామని స్వామిని వేడు కున్న నేపథ్యంలో పార్టీ నాయకత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మండల పార్టీ కన్వీనర్ మెట్టావిష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక సర్పంచ్ సుధాకర్, ఎంపీపీ సుగుణ, జడ్పిటిసి వెంకటసుబ్బయ్య, పార్టీ నాయకులు షేక్ మస్తాన్ (అగ్ని) బషీర్, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద కార్యకర్తలు ఎంతో సంతోషంగా మొక్కు తీర్చుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమం ఉద్దేశించి ఎంపీపీ గండవరం సుగుణ మాట్లాడారు. తమ నాయకుడు విడుదల కావడం సంతోషంగా ఉన్నారు. అనంతరం మైనార్టీ నాయకులు షేక్ మస్తాన్ మాట్లాడారు. అక్రమ కేసులతో మాజీ మంత్రి కాకాణిగోవర్ధన్ రెడ్డిని వేధించినారని అన్నారు. తమ నాయకుడు మెట్టాసారధ్యంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంచార, అర్ధసంచార జాతుల అభివృద్ధి కోసం బీజేపీ కట్టుబడి ఉంది



బీజేపీ జిల్లా అధ్యక్షులు శిపారెడ్డి వంశీధర్ రెడ్డి

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** విజయవాడలోని ది వెన్యూ ఫంక్షన్ హాల్ (నోవాటెల్ హోటల్ ఎదురుగా)లో సంచార, అర్ధసంచార విముక్త జాతుల విముక్తి దినోత్సవం శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు శిపారెడ్డి వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ.. సంచార జాతులు అంటే ఒకే చోట స్థిరపడకుండా, చలించు జీవన విధానం కలిగిన సమాజాలు. వీరు సాంప్రదాయకంగా జానపద కళలు, వృత్తులు, వాణిజ్యం, జంతుప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు ఆధారంగా జీవనం సాగిస్తారు. గంగిరెద్దుల కళాకారులు, డప్పుల వాయిద్యకారులు, బొమ్మల కళాకారులు, పాతకాలపు నాటక, హరికథ, బుర్రకథ బృందాలు, జానపద గీతాల బజానా బృందాలు, జంతుప్రదర్శన చేసే కుటుంబాలు వంటి అనేక వర్గాలు ఈ సంచార సమాజాల్లో భాగమవుతాయి అని తెలిపారు. '1871లో బ్రిటిష్ ప్రభుత్వం అమలు చేసిన క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ వల్ల సంచార, అర్ధసంచార సమాజాలకు అనవసరంగా దొంగల ముద్ర వేయబడింది. ఈ కారణంగా ఈ జాతులు పేదరికం, వివక్ష, నిర్లక్ష్యానికి గురయ్యాయి. కానీ, నేడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఈ సమాజాల విద్య, ఉపాధి, ఆరోగ్య సదుపాయాలు, సాంస్కృతిక పరిరక్షణ కోసం ప్రత్యేక పథకాలను అమలు చేస్తోంది,' అని చెప్పారు. సీడ్ పథకం ద్వారా విద్య, ఉపాధి, ఆర్థిక సాయం, డీఎన్‌టీ విద్యా పథకాలు ద్వారా పిల్లలకు ప్రత్యేక విద్యావకాశాలు సాంప్రదాయక కళలకు ప్రత్యేక గౌరవనిధులు ఆరోగ్య, వైద్య సహాయంసంచార, అర్ధసంచార సమాజాల సమగ్ర అభివృద్ధికి బీజేపీ చర్యలు. అంతేకాకుండా, రాష్ట్ర, జిల్లా స్థాయి బీజేపీ నేతలు, సంచార జాతుల సమాజ పెద్దలు, సాంప్రదాయక కళాకారులు, యువత, మహిళా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. 'ప్రతి కుటుంబం గౌరవప్రదమైన జీవితం గడపడం, ప్రతి పిల్లవాడికి విద్య అందించడం, ప్రతి కళాకారుడి ప్రతిభకు గుర్తింపు రావడం.. ఇదే బీజేపీ ధ్యేయం' అని శిపారెడ్డి వంశీధర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరీ ఫణిరాజు, రాష్ట్ర నాయకులు కోసురు బాలయ్య గౌడ్, ఆఫీస్ సెక్రటరీ కుప్పా ప్రసన్న, మాజీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్, త్రికాల శివకుమార్ గౌడ్, మారం కృష్ణ బట్టు రఘురామయ్య, ఐటీ సెల్ విభాగం శివ, తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థానం అభివృద్ధికి ఐదు లక్షల ఆర్థికసాయం

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలం పడమటి ఖమ్మంపాడు గ్రామంలోని శ్రీ కోదండ రామాలయం దేవస్థానం అభివృద్ధి కొరకు దేవాదాయ శాఖ సర్వ శ్రేయోనిది పథకం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి సహకారంతో ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేసినట్లు ఏఎంసీ డైరెక్టర్ వద్దిబోయిన లక్ష్మీ రెడ్డి, గ్రామ సర్పంచ్ కత్తి లావణ్య, తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ కత్తి పెంచలయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ దేవాలయం అభివృద్ధిలో వెనుక పడ్డాయని ఈ విషయాన్ని ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో మాట్లాడి ఆర్థిక సహాయం చేయించారని అన్నారు. ఈ దేవాలయానికి ఆర్థిక సహాయం చేయించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు జిల్లా సహకార సంఘం సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు మెట్టుకూరు కృష్ణారెడ్డికి ధన్యవాదాలు పేర్కొన్నారు.

# ఉత్తమ ఎంపీడీవోగా ఐజాక్ ప్రవీణ్



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తూ ఉత్తమ ఎంపీడీఓగా ఎంపికయ్యారు. గురువారం జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ చేతుల మీదుగా నెల్లూరు జెడ్పీ కార్యాలయంలో ప్రశంసా పత్రం అందుకున్నారు. ఉత్తమ ఎంపీడీఓగా ప్రశంసా పత్రం అందుకున్న ఐజాక్ ప్రవీణ్ ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది అభినందించారు.

# మాజీ ఎంపీని కలిసిన కారుమూరి, పర్వతరెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు డైకస్ రోడ్‌లో మాజీ మంత్రి పార్టీ పెద్దలు ,మేకపాటి రాజమోహన్ రెడ్డిని రీజినల్ కోఆర్డినేటర్ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వైఎస్ఆర్సిపి నెల్లూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వెం కటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి నెల్లూరు రూరల్ ఇన్ చార్జ్ ఆనం విజయకుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిలివేటి సంజీవయ్య గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు జిల్లా, రాష్ట్ర రాజకీయాల గురించి రాజ మోహన్ రెడ్డితో చర్చించారు.

# ఎమ్మెల్సీ మురళీధర్‌ని పరామర్శించిన కారుమూరి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా రాపూరులో ఎమ్మెల్సీ మేరీగ మురళీధర్ తండ్రి ఆనందరావు ఇటీవల స్వర్గస్తులవడంతో రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్‌రెడ్డి కలిసి మేరీగా మురళీధర్‌ని గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మేరీగ ఆనందరావు చిత్రపటానికి వారు నివాళులర్పించారు.

# అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మానవహారం, ధర్నా

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కేంద్రంలో ఏర్పడిన బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వంలు ఐసిడిఎస్ పరిస్థితిని గమనించి బలోపేతం చేయాలని, అంగన్‌వాడీ కార్యరక్తలు, సహాయకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిపిఎం పట్టణ ప్రధానకార్యదర్శి కె.డేవిడ్‌రాజు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రాజెక్ట్‌కమిటీ ప్రధానకార్యదర్శి పి.రాధ తదితరులు డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్రకమిటీ పిలుపుమేరకు ఆత్మకూరులో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ బస్టాండువద్ద ధర్నా, మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం సుప్రీమ్‌కోర్టు ఇచ్చిన గ్రాట్యుటిఅమలు తీర్పును ప్రక్కనపెట్టారన్నారు. కోర్కెల సాధనకు 42రోజులపాటు సమ్మె నిరవధికంగా చేశామని, అయితే నాడు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని వారు పేర్కొన్నారు. గత 10 సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. దేశవ్యాపితంగా అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్లు ఇవ్వకుండా పోషణ్‌ట్రాక్ యాప్‌ను తెచ్చి ఆధార్‌ను లింక్‌చేసి లబ్దిదారుల లిస్టును తగ్గించిందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయనందునే 42రోజులు నిరవధికసమ్మె చేయాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. ఐసిడిఎస్‌ను బలోపేతం చేయాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీమ్‌కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటి అమలు చేయాలని, ఐఎల్‌సి శిపార్సుల ప్రకారం కనీసవేతనాలు 26వేల రూపాయలు, పెన్షన్, పి.ఎఫ్, ఇఎస్‌ఐలను అమలుచేయాలని, మినీవర్కర్లను మెయిన్‌వర్కర్లుగా గుర్తించాలని, ఆ సెంటర్లకు హెల్పర్లను నియమించాలని, 42రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం మినిట్స్ కాపీలో అంగీకరించిన అంశాలను జివోలుగా ఇవ్వాలని, అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్‌ను బలోపేతం చేయాలని, 5సంవత్సరాలలోపు పిల్లలు ప్రవేటు కాన్వెంట్లకు వెళ్ళకుండా జివో ఇవ్వాలని, 4లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, ఐసిడిఎస్ ప్రవేటీకరణ, ప్రభుత్వసంస్థల ప్రవేటీకరణ ఆపాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనేక యాప్‌లను అమలుచేస్తుండగా తమకు గతంలో ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పనిచేయకపోవడం, సిగ్నల్స్ సక్రమంగా లేకపోవడంతో ఆన్‌లైన్‌లో



ఫోటోలు, వివరాలు నమోదుకు తీవ్రంగా ఇబ్బంది పడుతుండగా ఇటీవల ఆఫోన్‌లను వాపసు చేశామని, కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని, సిగ్నల్‌సిస్టం పెంచాలని కోరామని, అయినా నేటివరకు ప్రభుత్వం స్పందించలేదన్నారు. తక్కువ వేతనాలు పొందే అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కూడా తాము కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆవేదనతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టుకమిటీ ప్రధానకార్యదర్శి పి.రాధ, అధ్యక్షురాలు కె.రమణమ్మ, నాయకులు ఆర్.సుప్రజ, హమీదున్నీసా, ఎస్.విజయమ్మ, వాణిశ్రీ, లక్ష్మినారాయణమ్మ, సుధారాణి, ఆత్మకూరు పట్టణ, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై కదం తొక్కిన మున్సిపల్ అధికారులు

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ట్రంకు రోడ్లో కొన్ని సంవత్సరాలుగా సైడ్ డ్రైనేజ్ కాలువల పూడిక తీయక ట్రంకురోడ్లో ద్విచక్ర వాహనదార్లు, పాదాచార్లకు దుర్వాసన వెదజల్లడంతో ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కావలి మున్సిపల్ కమిషనర్ సిబ్బందికి ఆజ్ఞాపించగా శానిటరీ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం స్థానిక తులసి హెూటల్, కందుకూరి షాపుల ప్రాంతములు సుమారు 25మంది కార్మికుల చేత అక్కడ డ్రైనేజ్‌ని శుభ్రం చేయడం జరిగింది గత 20 సంవత్సరాల నుండి ఇక్కడ డ్రైనేజీ తీసిన దాఖలాలు లేవని అక్కడ ప్రజలు వివరించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలని ఉద్దేశంతో కార్మికులు చేత దగ్గరుండి శానిటరీ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో



వాటిని శుభ్రపరచడం జరిగింది. ప్రస్తుతం అక్కడ ప్రదేశం పరిశుభ్రంగా ఉండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేసి హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. కావలి పట్టణంలో డ్రైనేజీలు ఎండిపోయి దుర్గంధంతో ఉన్న ప్రదేశాలు ఇంకా ఉన్నాయని వాటిని కూడా ఇదేవిధంగా శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

## మండలంలో 90 ఫించన్లు రద్దు : ఎంపీడీఓ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో వివిధ అర్హతలులేని కారణంగా 90మంది పెన్షన్లను రద్దుచేశామని ఎంపిడివో పి.రఫీఖాన్ పేర్కొన్నారు. ఈ 90మంది తమకు అర్హతలు ఉన్నాయనుకుంటే తమకు అర్జీ, ఆధార్‌కార్డు, సదరన్ సర్టిఫికేటు, పెన్షన్‌రద్దు నోటీసులను జతపరిచి అందజేయాలని, తాము పున:పరిశీలనకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపిడివో పేర్కొన్నారు. ఆత్మకూరు గ్రామీణ మండలంలో మొత్తం 4861పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందులో ఆరోగ్యశాఖ పెన్షన్లు 24మందికి 15వేల రూపాయల వంతున పంపిణీ చేస్తుండగా అందులో 16పెన్షన్లు రద్దుచేశామని, వాటిలో 7పెన్షన్లను వైద్యాప్య పెన్షన్లుగా మార్చామని ఎంపిడివో వివరించారు. వికలాంగుల పెన్షన్లు 6వేల రూపాయల వంతున 419మందికి ఇస్తున్నామని, వాటిలో 66 రద్దు చేశామని, అందులో 39మంది పెన్షన్‌లను వృద్ధాప్యపెన్షన్లుగా మార్చామన్నారు. మెడికల్ పెన్షన్లు 24, వికలాంగుల పెన్షన్లు 66 మొత్తం 90 పెన్షన్లను రద్దుచేయగా వాటిలో 46పెన్షన్లను వృద్ధాప్య పెన్షన్లుగా మార్చామని, మిగతా 44పెన్షన్లు రద్దుచేశామని వివరించారు. వారిలో అర్హతలు కలిగినవారుంటే వెంటనే తమకు అప్పీల్ చేసుకోవాలని ఎండివో కోరారు.

## 24న భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరు–ముంబాయి జాతీయరహదారిపై నెల్లూరుపాళెం వద్ద ఉన్న శ్రీశ్రీశ్రీ భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో ఈనెల 24న 17వ ఆరాధనోత్సవంను ఘనంగా నిర్వహిస్తామని ఆలయకమిటీ ప్రతినిధి చెరుకూరు శ్రీహరి నాయుడు పేర్కొన్నారు. ఈ ఆరాధనోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు. ఉదయం 5గంటలకు సుప్రభాతం, 8గంటలకు స్వామి వారికి అభిషేకం, పూజలు శ్రీ మారుతీకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2గంటలకు భజన కార్యక్రమాలు, 3గంటలకు స్వామివారి గ్రామోత్సవం, రాత్రి 9గంటలకు పల్లకిసేవ కార్యక్రమాలుంటాయన్నారు. మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమాన్ని దివంగత పోలవరపు సుబ్బానాయుడు జ్ఞాపకార్థం ఆయన సతీమణి సుబ్బరత్నమ్మ, కుమారులు శివాజి, శ్రీనివాసులు, కోడలు హిమజశ్రీల ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. రాత్రి 10గంటలకు నెల్లూరుపాళెం, పేరారెడ్డిపల్లి భజనబృందంచే పండరిభజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులు విరివిగా ఆరాధనోత్సవంలో పాల్గొని స్వామి వారిని సందర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం : ఏఈ

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలం సోమశిల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిగ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎం.సురేష్ బాబు గురువారం తెలిపారు. సోమశిలఫీడర్‌లో విద్యుత్ సరఫరా లైన్లో మరమ్మత్తులు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి ఉదయం 5 నుంచి 8 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్లు తెలిపారు. సోమశిలవిద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రజలు విద్యుత్ సరఫరా నిలిపివేత కు సహకరించాలని తెలిపారు.

## కళాశాల వాహనాలకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రం సివిఆర్ మధురానగర్ నిర్వాసిత కాలనీ ప్రాంతంలో అదాని ఫౌండేషన్ నిర్మిస్తున్న కళాశాలకు వాహనాలు గ్రామం మీద కాకుండా మరోవైపున ప్రత్యామ్నాయంగా వెళ్లే విధంగా అవసరమైన స్థల మార్గాన్ని గురువారం అధికార పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ స్థలం చూశారు. గ్రామ కాపులు అనువైన స్థలాన్ని చూపెట్టారు. గ్రామం నుంచి కళాశాల వాహనాలు వెళ్తే ప్రమాదాలు జరుగుతాయని గ్రామస్తులు చెప్పడంతో స్థలం పరిశీలించారు. సమస్యను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి వెళ్లి పరిష్కారం చూపిస్తామని అధికార పార్టీ నాయకులు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ కాపులు తదితరులు పాల్గొన్నారు.

## పొదలకూరులో పలువురికి సోమిరెడ్డి పరామర్శ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం పొదలకూరు మండలంలో పర్యటించి పలువురు టిడిపి నేతలను పరామర్శించారు. తొలుత మండలంలోని విరువూరులో ఎద్దల ప్రసాద్ రెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న రామాలయాన్ని సందర్శించారు. మహ్మదాపురంలో టీడీపీ కార్యకర్త ఎండీ ఇర్షాద్ ఇటీవల గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే పొదలకూరులో మైనార్టీ సెల్ నేత షేక్ జమీర్ బాషా కోడలు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల టిడిపి అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పిఎసిఎస్ డైరెక్టర్ కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ అక్కెం సుధాకర్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, నల్లపాలెం నీటి సంఘం అధ్యక్షులు పార్లపల్లి రమేష్ రెడ్డి, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, టిడిపి నాయకులు షేక్. ఖాదర్ బాషా, దేవరం రఘురాం రెడ్డి, దేగా యశ్వంత్ రెడ్డి, ఆదాల మురళిరెడ్డి, రవి రాఘవేంద్ర, విరువూరు సర్పంచ్ జగన్మోహన్ రావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలి






**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లాకలెక్టర్లతో పలు అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు కలెక్టరేట్‌లోని శంకరన్ హాలు నుంచి కలెక్టర్ ఆనంద్, జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి శాఖకు లక్ష్యాలను నిర్దేశించి పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. అలాగే జిల్లాలో ప్రజలకు సరిపడ ఇసుక నిల్వలు సమృద్ధిగా వున్నాయని, రెండు డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా ఇసుకను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుకను పారదర్శకంగా సరఫరా చేసేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఆనంద్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని నివాస ప్రాంతాలను సర్వే చేసి, ఆయా గృహ యజమానులకు పూర్తి హక్కు కల్పించే స్వమిత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామకంఠం భూములు, ప్రభుత్వ భూముల బౌండరీలను షెడ్యూలు ప్రకారం పూర్తి చేయాలని భూ సర్వేరికార్డుల ఎడి నాగశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డికి సూచించారు. ఈనెల 23వ తేదీ మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మాన్సూన్ హైజినిక్ (వర్షాకాలంలో పాటించాల్సిన ఆరోగ్యకరమైన అలవాట్లు) కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో విద్యుత్, ఇరిగేషన్ ఎస్ఈలు విజయన్, దేశ్‌నాయక్, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, సిపివో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# 21వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభం





**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ పరిధిలోని ఉమ్మారెడ్డి గుంటలో 21 డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. నిత్యం ప్రజలకు తెలుగుదేశం పార్టీ కార్యాలయం అందుబాటులో ఉంటుందని దీనిని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. రాజకీయాల కతీతంగా ప్రతి ఒక్కరు అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 21 డివిజన్ ఇంచార్జి చాంద్ బాషా, కంటే సాయి బాషా, కోటిరెడ్డి, కృపారావు,, కరిముల్లా, ప్రకాష్, మురళి, రాజేష్, రహీం శశి, వసంత్, మణికంఠ, కన్నం సురేష్, సుమలత, లక్ష్మీ, తుపాకుల లక్ష్మీ, హజరత్, శ్రీనివాసులు, చిన్న ప్రసాదు నవీను, చోటు, సురేష్, కుప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దగ్ధం : టీడీపీ శ్రేణులు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి అనుచరులు అన్నవరం క్వారీ వద్ద డ్రోన్ కెమెరాతో అత్యాయత్నానికి ప్రణాళిక రూపొందించేందుకు క్వారీ వద్ద రెక్కీ నిర్వహిం చడం ప్రజాస్వామ్యవాదిని కలిచివేస్తోందనీ మారణాయుధాలతో రెక్కీ చేస్తూ పట్టుబడిన ఈ ఘటన అత్యంత దారుణం అని టీడీపీ బోగోలు మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బోగోలు మండలంలో గురువారం సాయంత్రం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే కృష్ణారెడ్డిపై జరిగిన హత్యాయత్న ప్రణాళికను తీవ్రంగా ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎంతో ప్రశాంతమైన కావలి నియోజకవర్గంలో ఇలాంటి అరాచకాలు సృష్టించవద్దని ప్రతాప్ కుమార్ రెడ్డిని వెంటనే పోలీసులు అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బోగోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరావు, మండల ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్ బాబు, కోడూరు వెంకటేశ్వర్ రెడ్డి, చిలకపాటి వెంకటేశ్వర్లు, ఎన్నాబత్తిన వెంకటే శ్వర్లు, కోటా వెంకరెడ్డి, ఇందుపూరు రామ్మోహన్ రెడ్డి, ఆది శేషయ్య, రఘురాం నాయుడు, శ్రీని వాస్ రెడ్డి, పుట్ట సుబ్బారావు, క్రాంతి, మనోహర్ ఎజికల్, పులి సుబ్బారావు, నేతి పిచ్చయ్య ,సంజయ్ సుభాని, ఎస్ఎస్ నాగరాజు, పులికొండలరావు కురుకొండయ్య, త్యాగరాజు, కాకి తిరుపతి, మాకా, రవి అలెక్స్, శీను, వినీత్, శేఖర్, బాబురావు, వెంకటేష్ పులి మహేష్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రాహ్మణక్రాక అగ్రహారంలో వ్యవసాయ శిక్షణ



**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బ్రాహ్మణక్రాక అగ్రహారం గ్రామంలో గురువారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వనరుల కేంద్రం టెక్నికల్ ఏవో ఎస్.రామ్మోహన్ రైతులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువుల ప్రాముఖ్యత లను వివరించారు. ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటలో దోమపోటు నివారణకు నత్రజని ఎరువులు తక్కువగా వేసుకోవాలని, పొటాషియం ఎరువులను తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. సింథటిక్ పైరిత్రాయిడ్స్ మందులను వాడ రాదని, దోమపోటు నివారణకు పై మెట్రో జిన్ 120 గ్రాములు, లేదా ట్రై ఫ్లూ మెజోపైరిమ్ 100 మిల్లీ లెటర్లు ఒక ఎకరాకి పిచికారి చేసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఎం.శ్రీవాణి, వ్యవసాయ విస్తరణాధికారి ఎన్ శిల్పకళ, వీఏఏ శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

## శ్రీవారి సన్నిధిలో..

## సినీనటుడు నాగ చైతన్య దంపతులు



**తిరుమల, మేజర్‌న్యూస్ :** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని గురువారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమ యం అనంతరం సినీన టుడు అక్కినేని నాగ చైతన్య దంపతులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్సు నుండి ఆలయం మహా ద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల అక్కినేని నాగ చైతన్య దంపతులను చూసేందుకు వారితో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** శ్రీకాళహస్తి పట్టణం పురపాల క సంఘం పరిధిలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు, పారిశుద్ధ్య కిట్లును శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుర పాలక సంఘాన్ని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నా మని, పారిశుధ్య కార్మికులకు ఆధునిక యంత్రాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని, శ్రీకాళహస్తి పట్టణా న్ని అభివృద్ధి చేయడానికి కావలసిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాకట్టు వ్యాపారుల దోపిడిని అరికట్టాలి

**శాంతిపురం, మేజర్‌న్యూస్ :** రామకుప్పంమండలంలో జై లక్ష్మి బ్యాంకర్స్ నగలు తాకట్టు వ్యాపా రులు రెచ్చిపోతున్నారు పేదల అవకా శాలే ఆసరాగా అధిక వడ్డీలు వసూ లు చేస్తూ దోచుకుంటు న్నారు. ముక్కు పిండి మూడు రూపాయల నుంచి ఐదు రూపాయలు దాకా వడ్డీలు వసూలు చేస్తే పేదలను దోచు కుంటున్నారు. ప్రభుత్వ నిబంధనకు విరుద్ధంగా వడ్డీలు వసూలు చేస్తే లక్షల పోగేసు కుంటున్నారు. పేదల ను బలి చేస్తున్నారు. పేదలు అవస రాల కోసం బంగారు నగలను స్థానిక తాకట్టు వ్యాపారుల పెడుతు న్నారు. తక్కువ వడ్డీకే డబ్బులు ఇస్తామంటూ నమ్మ పలుకుతున్నారు అవసరాలకు నగలు తాకట్టు అనం తరం పేదలకు చుక్కలు చూపిస్తున్నారు.

# స్వర్ణాంధ్రవిజన్ 2047 కార్యాచరణతో రాష్ట్రసర్వతోముఖాభివృద్ధి



## అధికారులు శ్రద్ధ చూపాలి : మంత్రి ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూపొందించిన స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికతో రాష్ట్రసర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, అన్ని వర్గాల ప్రజలకు సకలసౌకర్యాలు సమకూరుతాయని, భావితరాలకు బంగారుభవిష్యత్తు లభిస్తుందని, సమిష్టికృషితోనే విజన్2047 ప్రణాళిక అమలుకావాల్సి ఉందని రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు అయన అధికారులు ఈవిషయమై శ్రద్ధచూపాలంటూ తరచూ చర్చిస్తూ సమీక్షిస్తున్నారు. స్వర్ణాంధ్ర 2047 ఆత్మకూరు నియోజకవర్గ విజన్ యాక్షన్‌ప్లాన్ అమలుపై అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, జర్నలిస్టులతో మంత్రి సమీక్షా సమావేశం కూడా నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల మేరకు విజన్‌యాక్షన్‌ప్లాన్‌లో ఈ నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికపై దిశానిర్ధేశం చేశారు. ఈమేరకు మంత్రి ప్రత్యేక దృష్టి సారించగా రెవిన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, విద్యుత్, సాంఘికసంక్షేమాధికారులు రానున్న ఐదేళ్ళలో ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టనున్న స్వర్ణాంధ్ర2047 ప్రణాళికలను మంత్రికి వివరించారు. రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం, పరిశ్రమల స్థాపనకు, యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, పి4వంటి 10సూత్రాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని నరేంద్రమోడీ వికసిత్‌భారత్2047 లక్ష్యాలకను గుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన గొప్ప ఆలోచన స్వర్ణాంధ్ర 2047 విజన్‌ప్లాన్ , ఈప్లాన్ ముఖ్యఉద్ధేశాలను గుర్తించి లక్ష్యసాధనకు అధికారయంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యమంత్రి నుండి వార్డు కౌన్సిలర్ వరకు చీఫ్‌సెక్రటరినుండి క్రిందిస్థాయి అధికారివరకు ప్రజలంతా తమ ఆలోచనలను ఈ విజన్‌ప్లాన్‌లో పొందుపరచాలని, ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో బాగస్వాములు కావాలని ఆనం కోరుతున్నారు. స్వర్ణాంధ్రవిజన్ 2047 యాక్షన్ ప్లాన్‌ను పవిత్ర భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లతో సమానంగా భావించాలని అధికారులకు ఆయన సూచించారు. మన నియోజకవర్గంలో అభివృద్ధికి అనేక అవకాశాలున్నాయని, మే1న ఆత్మకూరు సమీపంలోని నాగరంపేటవద్ద ఎంఎస్ ఎంఈ పార్కును ముఖ్యమంత్రి ప్రారంభించారని, బాలికలవిద్యాభివృద్ధికి అనేక విద్యాలయాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కాలేజి రానుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గానికి నోడల్‌అధికారిగా స్థానిక ఆర్డీవో పావనిని ప్రభుత్వం నియమించిందని, ఆయనతోపాటు కొందరు అధికారుల టీమ్‌కూడా ఈప్లాన్ రూపకల్పనలో కీలకంగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. అధికారులు విజన్2047పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు తదితరులంతా సహకరించాలని మంత్రి ఆనం కోరుతున్నారు.


సూర్య
# విలేకర్లు కావలెను
తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
**కావలసిన సెంటర్లు**
నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
**నేటి దినపత్రిక సూర్య కార్యాలయం**
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
**9000118811, 9000483583**

# కుళాయిల మరమ్మత్తులు చేపట్టి నీటి వృధాను అరికట్టండి

## ఎస్ఈ రామ్ మోహన్ రావు



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో సరైన నిర్వహణలో లేని వీధి తాగునీటి కుళాయిలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, నగరవ వ్యాప్తంగా నీటి వృధాను అరికట్టాలని ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్‌మోహన్‌రావు అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక గిడ్డంగి వీధి, కంసాలి వీధి, కుక్కల గుంట, మునిసిపల్ వెహికల్ షెడ్డు పరిసర ప్రాంతాలలో గురువారం ఉదయం పర్యటించారు. వివిధ ప్రాంతాలలో తాగునీటి సరఫరా స్వచ్ఛత నాణ్యతను ఎస్ఈ ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్దేశించిన ప్రమాణాలను పాటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. కుళాయిలకు మూతలు లేకుండా, డ్యామేజ్ అయి, పగిలిపోయి ఉన్న కండిషన్‌లో ఉన్న వాటిని గుర్తించి వెంటనే రిపేర్లు చేపట్టాలని, అవసరమైనచోట్ల ట్యాప్‌లను బిగించాలని ఆదేశించారు. డ్రైను కాలువలలో మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వ్యర్ధాలను తొలగించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# అవార్డులు పొందిన అధికారులకు సన్మానం



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ జిల్లా కలెక్టర్ ఆనంద్ చేతుల మీదగా ఉత్తమ అధికారులుగా అవార్డులు పొందిన పలువురు పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఉద్యోగులకు జడ్పీ చైర్ పర్సన్ ఆనంఅరుణమ్మ, జడ్పీ సీఈవో మోహన్ రావులు గురువారం ఘనంగా సన్మానించారు. జిల్లాలోని పలువురు ఎంపీడీవోలు, జడ్పీ, పంచాయతీ రాజ్ ఉద్యోగులు లను జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో వారికి ప్రశంస పత్రాలు అందజేసి సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఎల్ శ్రీధర్ రెడ్డి, డిఎల్‌డివో వసుమతి, పలువురు ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపుల జోరు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రాంతంలోని గ్రామాల్లో పరిశీలిస్తుంటే మద్యం బెల్ట్‌షాపులజోరు హుషారుగా కన్పిస్తున్నాయి. నాలుగైదురోజులుగా మేజర్‌న్యూస్ గ్రామాల్లో పరిశీలిస్తుంటే జనాలనుండి తమ గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, తమ గ్రామంలో ఐదుమంది అని ఒక గ్రామం వారంటే తమగ్రామంలో నలుగురు, తమ గ్రామంలో ఇద్దరు అమ్ముతున్నారని చెబుతున్నారు. మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలో మాత్రం తద్భిన్నంగా చెప్పారు. ఆగ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే 10వేల రూపాయల జరిమానా విధించేలా ఆంక్షలు విధించుకొని కట్టుబాటు చేశారు. మండలంలో ఈ గ్రామం అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. గ్రామాలకు మద్యంను దుకాణాదారులే సరఫరాచేస్తుంటారని చెబుతున్నారు. మహిమలూరులో మద్యం దుకాణం ఉన్నందున సమీప రామస్వామిపల్లిలో మాత్రం బెల్ట్ షాపులు లేవని చెబుతున్నారు. మద్యం దుకాణాలను ఆత్మకూరు పట్టణంలో, మండలంలోని మహిమలూరులో ఏర్పాటు చేయగా అక్కడికెళ్ళి మద్యపాన ప్రియులు మద్యం తెచ్చుకోవడం కొంత తగ్గుతుందని అందరూ భావించగా గ్రామాలకే మద్యం సరఫరా అవుతుండడంతో మద్యం సేవించేవారి సంఖ్య కూడా పెచ్చుపెరిగిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొన్నిచోట్ల దేవుడిపాట అంటూ మద్యం విక్రయించేవారు కొంత నగదును చెల్లించి మద్యం విక్రయించేలా ఏర్పాట్లు జరగ్గా మరికొన్ని చోట్ల పంచాయతీవారికి నగదు చెల్లించే ఏర్పాటు జరిగిందని చెబుతున్నారు. గ్రామాల్లో మద్యం అమ్మకాలు లేనేలేవని ప్రభుత్వం చెబుతుండగా గ్రామాల్లో ప్రజలు మాత్రం విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారని చెబుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి కట్టడి చర్యలు లేకుండా మౌనంగా చూస్తున్నారని, ఎవరైనా స్క్వాడ్ సిబ్బంది దాడులు నిర్వహించినపుడు మాత్రమే సంబంధిత వ్యక్తులను తీసుకెళుతుంటారని, వారు బెయిల్‌పై వచ్చి మళ్ళీ మద్యం విక్రయాలు సాగిస్తుంటారని కొందరు చెబుతుతున్నారు. ఏదేమైనా ఆత్మకూరు మండలంలోని గ్రామాల్లో మాత్రం విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను సాగిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలనుండి తెలుస్తోంది. ఈపరిస్థితి మహిళలకు కూడా ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరి అధికారులు స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.

# బాల్యవివాహాలను అరికట్టాలి : ఆర్డీఓ




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి గురువారం కావలి ఆర్డిఓ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి ఆర్డీఓ ఎస్.వంశీకృష్ణ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అలాగే బాల్య వివాహాల వలన వారికి కలుగు నష్టలను, కష్టాలను గురించి క్షుణ్ణంగా వివరించాలని సంబంధిత అధికారులు ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు సురేష్, డీఎస్పీ శ్రీధర్, కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, తహసిల్దార్ శ్రావణ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.